క్లుప్తంగా

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి



పొన్నూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేవిధంగా ఉపాధ్యాయులు బోధించాలని టీచ్ అండ్ టీపీడీ మ్యాథ్స్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ టి.వీరయ్య అన్నారు. మంగళవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీచ్‌టూల్ యాప్‌లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సందేహాలను ఆయనకు వివరించారు. యాప్‌లో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని వీరయ్య తెలిపారు. సమావేశంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం' సక్రమంగా అమలు చేయాలి



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశించే విద్యార్థులకు ప్రతి రోజు రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశించే విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలకు సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడంతో పాటు ప్రతి విద్యార్థి భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సత్యం ఉన్నారు.

కౌన్సిలర్ సైకాలజిస్ట్ ప్రభావతికి డాక్టరేట్ ప్రదానం



గుంటూరు రూరల్: నగరంలో ప్రముఖ కౌన్సిలర్ సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్న ఎం.ప్రభావతికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. సెయింట్ జోసెఫ్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.శ్రీలత పర్యవేక్షణలో 'గవర్నమెంట్, ప్రైవేటు ఇంటర్మీడియెట్ కాలేజీల్లో చదివే మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థుల యొక్క కుటుంబ వాతావరణం వారి వ్యక్తిగత విలువలు, అకడమిక్ అచీవ్‌మెంట్‌పై చూపే ప్రభావం' అనే అంశంపై ప్రభావతి చేసిన పరిశోధనకు ఏఎన్‌యూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. డాక్టరేట్ పొందిన ప్రభావతిని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెదబాబు, డీకే సుబ్బారెడ్డి, ఏపి ఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుదీర్ బాబు, ఇతర కుటుంబ సభ్యులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

చెత్త పనులతో సంపదకు తూట్లు

- వినియోగానికి నోచుకోని చెత్త సంపద కేంద్రాలు
- పలు గ్రామాల్లో సేకరిస్తున్న చెత్తకు నిప్పు
- పంచాయతీల ఆదాయానికి గండి
- పొగతో ప్రజల ఇబ్బందులు



పొన్నూరు సంపద కేంద్రం వద్ద చెత్తకు నిప్పు పెడుతున్న దృశ్యం

పొన్నూరు: పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త నుంచి సంపద సృష్టించాలని ప్రభుత్వాలు మొత్తుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన మేర ఫలితాలు దక్కడం లేదు. చెత్త నుంచి సంపద సృష్టించేందుకు మండలంలోని పలు గ్రామాల్లో సంపద కేంద్రాలు నిర్మించారు. గ్రామాల్లో ఇంటింటా వ్యర్థాలు సేకరించేందుకు హరిత రాయబారులను నియమించి కార్యచరణ రూపొందించారు. చెత్త సంపద కేంద్రాలపై మండల పరిషత్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ప్రతి ఊరిలో ఎక్కడికక్కడ రహదారుల పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తకు నిప్పు పెట్టి చేతులు దులుపుకొంటున్నారు.



మునిపల్లెలో నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం

ఇదీ పరిస్థితి..

మునిపల్లె, మామిళ్లపల్లి, బ్రాహ్మణకోడూరు, గోళ్లమూడిపాడు, వల్లభరావుపాలెం, చింతలపూడి, ములకుదురు, జూపూడి గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పలు గ్రామాల్లో వినియోగంలో లేక కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి నిప్పు పెడుతున్నారు. దీంతో వ్యాపిస్తున్న పొగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

దృష్టి సారిస్తే ప్రయోజనం

గతంలో చెత్త సంపద తయారీ కేంద్రాలకు చేరిన వ్యర్థాలను తడి, పొడిగా వేరుచేసి ఎరువు తయారు చేసేవారు. దీంతో పంచాయతీలకు కొంతమేరకు ఆదాయం సమకూరేది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో లక్ష్యం నీరు గారిపోయింది. ఇప్పటికైనా రూ. లక్షల వ్యయంతో నిర్మించిన చెత సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తే పంచాయతీలకు ఉపయోగకరంగా ఉంటుంది.

పొన్నూరు మండలంలోని గ్రామాలు : 29
జనాభా : 63,504
గ్రీన్ అంబాసిడర్లు: 65
పనులు పూర్తయిన కేంద్రాలు: 27
సంపద కేంద్రాలకు చెత్తను తరలిస్తున్న గ్రామాలు : 8

చర్యలు తీసుకుంటున్నాం



సంపద కేంద్రాల నిర్మాణం పూర్తయిన చోట సంపద సృష్టించేందుకు చర్యలు చేపట్టాం. ఇందుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. హరిత రాయబారులకు తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని తెలియజేశాం. సంపదకేంద్రాల్లో చెత్తకు నిప్పు పెడితే చర్యలు తీసుకుంటాం.

– డి.మల్లికార్జునరావు, ఈఓపీఆర్‌డీ, మండల పరిషత్, పొన్నూరు

వినియోగంలోకి తేవాలి..



చెత్త నుంచి సంపద తయారీ చేసేందుకు షెడ్లని నిర్మించడం బాగుంది. అయితే ఇవి నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకుని రావాలి. ఎరువుల తయారీకి ప్రణాళికలు రూపొందించాలి. వర్మీకంపోస్టును తయారు చేసి, స్థానికంగా ఉండే రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఈ ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయాలి.

– షేక్ నజీర్ అహ్మద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, పెదకాకాని

'చెత్త'శుద్ధి ఏదీ..?



అగతవరప్పాడు గ్రామ శివారులో గడ్డి పెరిగి నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం

పెదకాకాని: మండలంలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో అవి పలు గ్రామాల్లో మందుబాబులకు స్థావరాలుగా మారాయి. గ్రామాలకు కొంత దూరంలో ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. కొన్నిచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పెదకాకాని మండలంలో 12 పంచాయతీలు ఉండగా 12 పంచాయతీలకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రభుత్వం 2017–18లో మంజూరు చేసిం ది. ఒక్కొక్క కేంద్రానికి సుమారు రూ.3.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ వెచ్చించి నిర్మించారు. కనీసం ఖర్చు చేసిన దానిలో కొంత ఆదాయం కూడా రాకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిపై చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పర్యవేక్షించాలి. చెత్త నుంచి ఆదాయం పెంచుకుని ఆ మొత్తాన్ని గ్రామ పంచా యతీల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దత్తపీఠంలో ప్రత్యేక పూజలు



భక్తులకు అనుగ్రహభాషణం చేసి రక్షను అందిస్తున్న దత్త విజయానందతీర్థ స్వామీజీ

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని చౌడవరం గ్రామంలోని దత్తనాథ క్షేత్రంలో దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థ స్వామీజీ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష దీపోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నారాయణ హోమం, సంపూర్ణ భగవద్గీత పారాయణ, అనంతరం దంపతులచే సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను స్వామీజీ అందించారు. స్వామీజీ భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. రక్షను అందించారు. పీఠం సభ్యులు బొంతు సీతారామిరెడ్డి, బీఎల్‌కే కుమార్ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో వందలాదిగా భక్తులు పాల్గొన్నారు.

ఇష్టానుసార కోతలతో ఇక్కట్లు

పెదకాకాని: మండలంలో ముందస్తు సమాచారం లేకుండా విధిస్తున్న కరెంటు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో పెదకాకాని, తక్కెళ్లపాడు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, ఐజేఎం, ఆటోనగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతుంది. గత కొంతకాలంగా ఎటువంటి ముందస్తు ప్రకటన లేకుండానే కరెంటు సరఫరాలో అంతరాయం సృష్టిస్తున్నారు. రాత్రిళ్లు సైతం కరెంటు కోతలు ఉంటుండడంతో ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. పెదకాకాని, పాతూరు ఏరియాలో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కారణం లేకుండా కరెంటు సరఫరాలో అంతరాయం సృష్టించడంపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

ఎంపీడీఓ కె.లలిత



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కె.లలిత, వేదికపై ఎంపీపీ సాహితి

చేబ్రోలు: చేబ్రోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.లలిత అధ్యక్షతన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మంగళవారం ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.లలిత మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారీలో భాగంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు వివిధ ప్రభుత్వ అభివృద్ధి శాఖల సిబ్బంది, ఉద్యోగులు, గ్రామ ప్రజల అవసరాలను, సమస్యలను, ప్రాధాన్యత అంశాలను గుర్తించేందుకు కాలినడకన గ్రామంలో తిరిగి సేకరించిన వివరాలు అభివృద్ధి ప్రణాళికకు దోహదపడతాయన్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలిగడ్డ సాహితీ మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీలు, ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్స్‌కు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పంచాయతీరాజ్ చట్టాలు, గ్రామ పంచాయతీల సమావేశాల ప్రాముఖ్యత , తీర్మానాలు ఆమోదం , స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కలిగి ఉండటం జీపీడీపీ తయారికి పీఆర్ఏ టెక్నిక్‌లు శ్రేయస్కరమని తెలిపారు. ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, శిక్షణ రిసోర్స్ పర్సన్స్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



మునిపల్లెలో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్

పొన్నూరు: మండలంలోని నండూరు, మునిపల్లె గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ అధికారులు, పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి టన్నుల కొద్ది రేషన్ బియ్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ కిరణ్ బాబు నండూరు గ్రామంలో ఓ ఇంట్లో నిల్వచేసిన 53 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎండీయూ వాహనంలో తరలించి ఓ ఇంట్లో నిల్వచేస్తున్నట్లు వచ్చిన సమాచారం వరకు తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీలో పట్టుబడిన బియ్యం స్వాధీనం చేసుకొని వాహనదారుడు శ్రీకాంత్, ఇంటి యజమాని గండికోట వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మునిపల్లె గ్రామంలో స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తనిఖీలు నిర్వహించారు. స్థానిక డీలర్ వద్ద 41 క్వింటాళ్ల రేషన్ బియ్యం వ్యత్యాసం ఉండడంతో 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

అంబేడ్కర్ జీవితచరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి



పొన్నూరు: అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలని కవి డాక్టర్ కత్తి పద్మారావు చేపట్టిన లక్ష పోస్టు కార్డుల ఉద్యమానికి దార్ల ఆగ్రో ఫామ్స్ ఎండీ దార్ల రమేష్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోస్టు కార్డులను ఆవిష్కరించారు. రమేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఉద్యమానికి పూర్తి సహకారం అందిస్తామని పది వేల కార్డుల వరకు స్పాన్సర్ చేస్తానని ప్రకటించారు. దార్ల రమేష్‌ని కవి డాక్టర్ కత్తి పద్మారావు అభినందించారు. కృష్ణా జిల్లా దళిత మహాసభ కన్వీనర్ కృష్ణ రంగం రాజేష్, లోకాయత పబ్లికేషన్స్ ఎడిటోరియల్ బోర్డు మెంబర్ గద్దం విజయరావు పాల్గొన్నారు.

సోలార్ పవర్‌తో విద్యుత్ బిల్లులు ఆదా

విద్యుత్ శాఖ ఏడీఈ శ్యాంకుమార్



పొన్నూరు: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనతో రాయితీపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుని గృహ వినియోగదారులు విద్యుత్ బిల్లు తగ్గించుకోవాలని విద్యుత్ ఏడీఈ జి.శ్యాంకుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సూర్యఘర్‌పై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సభకు పట్టణ విద్యుత్ ఏఈ వెంకయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ 1 కిలోవాట్ కేంద్ర ప్రభుత్వం రూ.30 వేలు రాయితీ ఇస్తుందని తెలిపారు. 2 కిలోవాట్‌కు రూ.60 వేలు, 3 కిలోవాట్‌కు రూ.78 వేలు రాయితీ ఇస్తుందని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో మన్నె సుశీల్ కుమార్, వినియోగదారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

- తహసీల్దార్ పి.కృష్ణకాంత్
- గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ




పెదకాకానిలో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ పి.కృష్ణకాంత్

పెదకాకాని: ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.కృష్ణకాంత్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని లైబ్రేరియన్ వేముల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ పి.కృష్ణకాంత్, ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావులు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ ఈనెల 14 నుంచి ప్రారంభమయ్యే వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డిబేటింగ్, చిత్రలేఖనం, రంగవల్లుల అలంకరణ వంటి అంశాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతలకు ఈనెల 20వ తేదిన అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏటుకూరులో..

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు గ్రామ గ్రంథాలయంలో ఈనెల 14వ తేదీనుంచి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని గ్రంథాలయ అధికారిణి పి.పరమేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, ఆటల పోటీలు, ర్యాలీలు, గ్రంథాలయ పరిచయం, తదితర పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేయటం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వారోత్సవాల్లో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

బెల్టు షాపు తొలగించాలంటూ మహిళల నిరసన



కొత్తరెడ్డిపాలెంలో నిరసన వ్యక్తంచేస్తున్న మహిళలు, సీఐటీయూ నాయకులు

చేబ్రోలు: ఇళ్ల మధ్యలో బెల్టు షాపు ఏర్పాటు చేసి మద్యం అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ కొత్త రెడ్డిపాలెం చెన్నా రెడ్డి కాలనీ సెంటర్ వద్ద మంగళవారం స్థానిక మహిళలు నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన వల్లూరి శ్రీనివాసరావు అనే వ్యక్తి అక్రమ మద్యం అమ్మకాలు చేస్తున్నాడని, దుకాణం మూయించాలంటూ మహిళలు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్కూల్, కాలేజీ పిల్లలు, మహిళలు నిరంతరం సంచరించే ప్రాంతంలో మద్యం అమ్మకాల వల్ల తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క ముఖ్యమంత్రి బెల్ట్ షాపులు అనుమతించమని చెబుతున్నప్పటికీ అదే పార్టీకి చెందిన వ్యక్తులు బెల్టు షాపులను నిర్వహించడం విడ్డూరమన్నారు. ఇళ్ల మధ్య అమ్మడం వల్ల మందుబాబులు చుట్టుపక్కల ఇళ్లలోకి వచ్చి తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని అన్నారు. ఈ సమస్య పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. పోలీస్, రెవెన్యూ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సీపీఎం నాయకులు ఆదిశేషులు, శ్రీనివాసులు, కేలోతు లక్ష్మి, కేతావత్ చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో స్పైరులినా ల్యాబ్ ప్రారంభం



వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ల్యాబ్ ప్రారంభోత్సవంలో చైర్మన్ లావు రత్తయ్య, స్పైరులినా ల్యాబ్ ప్రతినిధులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో స్పైరులినా ల్యాబ్‌ను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి న్యూఢిల్లీలోని ఐసీఏఆర్–ఐఏఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ప్రొఫెసర్ ఓపీ తివారి, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య హాజరై ల్యాబ్‌ను ప్రారంభించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ స్పైరులినాను పౌడర్, క్యాప్సూల్స్, టాబ్లెట్స్ వంటి వివిధ రూపాల్లో ప్రాసెసింగ్ చేసి వినియోగదారులకు అందించడం, స్పైరులినాను ప్రోటీబార్, ఎడిబుల్ స్నాక్స్ వంటి ఉత్పత్తులుగా కూడా మార్చవచ్చునని పేర్కొన్నారు. స్పైరులినాకు అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉందని, దీనిని ఎగుమతి చేసి విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించి దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు చేయవచ్చునన్నారు. స్పైరులినాను పర్యావరణానికి హానికరం కాని పద్ధతిలో పండించవచ్చుని, స్వల్ప నీటితోనూ, తక్కువ భూమి అవసరంతోనూ పెంచుకోవచ్చన్నారు. దీని పెంపకం వలన మలినాల కారణంగా కలిగే పర్యావరణ ప్రభావాలు తక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మధుమేహంపై అవగాహన సదస్సు

గుంటూరు మెడికల్: మధుమేహం నిరోధమే లక్ష్యంగా ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం శాస్త్రీయ అవగాహన సభ నిర్వహించనున్నట్లు ఎస్‌హెచ్‌ఓ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ తెలిపారు. ప్రపంచ 'మధుమేహం నిరోధక దినం' సందర్భంగా ఉదయం 9 గంటలకు 'మధుమేహం– కారణాలు– లక్షణాలు– నిర్ధారణ పరీక్షలు– చికిత్స విధానాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు 'అనే అంశంపై స్థానిక బ్రాడీపేట 2వ లైనులోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో అవగాహన సభ జరుగుతోందన్నారు.

ఉత్తమ అధ్యాపకులకు సన్మానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆరుగురు అధ్యాపకులు ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందడం సంతోషంగా ఉందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.గంగాధర రావు అన్నారు. మంగళవారం అవార్డు గ్రహీతలను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేసారి ఆరుగురు అధ్యాపకులు ఎం.త్రిమూర్తి రావు, వై.అశోక్ కుమార్, ఎన్.వి.కృష్ణారావు, డి.రామచంద్రన్, పి.బ్రహ్మాజీ రావు, పి.పూర్ణచంద్రరావులకు అవార్డులు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. బోధన, పరిశోధన రంగాల్లో మీరు చేస్తున్న కృషికి ఫలితమని చెప్పారు. ఇటువంటి అవార్డులు బాధ్యతలను పెంచుతాయని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులతో వర్సిటీ ఖ్యాతిని పెంచాలని కోరారు. విశ్వవిద్యాలయ మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని కోరారు. సందర్భంలో రెక్టార్ కే రత్న షీలా మణి, రిజిస్ట్రార్ జి. సింహాచలం, ఓఎస్‌డీ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, సీడీసీ డీన్ వి.రవికుమార్, పిజి పరీక్షల కోఆర్డినేటర్ ఎం.సుబ్బారావు, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ పి.పద్మావతి, కెమిస్ట్రీ విభాగం సీనియర్ ఆచార్యులు ఆర్.రమేష్ రాజు పాల్గొన్నారు.

డిసెంబర్ 8న పాటలు, ఏక పాత్రాభినయ పోటీలు



లక్ష్మీపురం: సీపీఐ ఆవిర్భవించి డిసెంబర్ 26వ తేదీకి వందేళ్లు కావస్తున్న సందర్భంగా వేడుకలను అభ్యుదయ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 8వ తేదీన పాటలు, ఏకపాత్రాభినయ పోటీలు ఉంటాయని ఐపీటీఏ జాతీయ కార్యదర్శి గని అన్నారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అభ్యుదయ, దేశభక్తి, జానపద గీతాలతోపాటు సాంఘిక, చరిత్రాత్మక సంబంధిత ఏకపాత్రాభినయ పోటీలు 18 – 35 సంవత్సరాల లోపు యువకులకు ఉంటాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు మాట్లాడుతూ యువతను కళారూపాల ద్వారా మేల్కొల్పాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ప్రజానాట్య మండలి గుంటూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు మిట్టపల్లి మహేంద్ర, చెవుల పున్నయ్య తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 94414 52819, 94917 94056 ఫోను నెంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED

■ నూతనంగా ప్రారంభించిన బ్యాంక్ అనుబంధ సంస్థ నందు పనిచేయుటకు VRS, Rtd, వ్యాపారస్తులు కావలెను. జీ+ESI+PF+ఇన్సెంటివ్స్ –75000/– ✆7013481406

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ ఆఫీస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692.

■ Montessori EM School Lakshmipuram, Guntur. Requires Teachers and Incharges. Cont: 6305028254

■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th- డిగ్రీ, Sal: 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. Cont: 8073902428

■ ప్రముఖ హోల్‌సేల్ షాపు నందు పనికి 10th - PG అర్హతగల కంప్యూటర్ ఆపరేటర్ &క్యాషియర్ కావలెను. 8 గం॥ డ్యూటీ. భోజనం + వసతి. ఆకర్షణీయ జీతం. Loc: గుంటూరు. 89196 13904

■ నెల్లూరు జిల్లా ప్రముఖ పవర్ ఇండస్ట్రీ నందు పర్మినెంట్‌గా పని చేయుటకు Ex-ARMY గార్డ్స్ కావలెను. 8గం॥ డ్యూటీ,జీతం : 34,000/- ఉచిత వసతి కలదు. 77999 27624, 77999 27609.

■ బిజినెస్ మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, తెలుగు, ఇంగ్లీష్ భాషలపై నైపుణ్యం, 3 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, రెజ్యూములను hoadvtjobs@gmail.comకు పంపగలరు.

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ఫోన్: 9160090024, 9640400073

సాక్షి క్లాసిఫైడ్స్ రూ.475 రూ.100

గుంటూరు 7075167541 7075167663

గమనిక

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ప్రత్తిపాడు డివిజన్

90109 57733 (ప్రత్తిపాడు)

90109 62225 (పొన్నూరు)

Office mail : sakshigntadvt@gmail.com